క్లుప్తంగా

తొమ్మిది సెట్ల నామినేషన్ల దాఖలు

మండపేట: మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదో రోజైన సోమవారం నాటికి ఏడుగురు గురు అభ్యర్థులు, తొమ్మిది సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పౌరసరఫరాల విభాగం జిల్లా మేనేజర్ ఎల్లారావు తెలిపారు. టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు రెండు సెట్లు, అదే పార్టీ తరపున జోగేశ్వరరావు అల్లుడు వల్లూరి సాయి కుమార్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) అభ్యర్థిగా సాదే డేవిడ్‌రాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

ఎకరాకు 48 బస్తాల సరాసరి దిగుబడి



కపిలేశ్వరపురంలో వరి దిగుబడిని పరిశీలిస్తున్న ఏఓ తదితరులు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలు ప్రామాణికంగా ఎకరాకు సరాసరిన 48 బస్తాల ధాన్యం దిగుబడి లభిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. కపిలేశ్వరపురంలోని కొత్తపల్లి భాస్కరరావు వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 60 పంట కోత ప్రయోగాలు చేయాలన్నది నిర్ణయం కాగా ఇప్పటి వరకు 25 ప్రయోగాలు పూర్తి చేశామన్నారు. వ్యవసాయ, ఆర్థిక గణాంక, రెవెన్యూ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ప్రయోగాలు శాస్త్రీయతకు ప్రామాణికమన్నారు. ఐదు చదరపు మీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణంలోని పంటను మాసూలు చేసి దిగుబడిని అంచనా వేస్తున్నామన్నారు. ఎంపీఈఓ పీవీడీ భవాని, పంట బీమా ఏజెంట్ జి .నాగేంద్రరావు, రైతులు కొత్తపల్లి భాస్కరరావు, అరిగెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి



లెనిన్ జయంతి సభలో మాట్లాడుతున్న చీకట్ల వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: విప్లవ నాయకుడు ఐవీ లెనిన్ జయంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వెంకటాయపాలెం గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ మొట్టమొదటి సోషలిస్టు విప్లవ విజేత కామ్రేడ్ ఐవీ లెనిన్ అని అన్నారు. లెనిన్ పోరాటాలు నేటి తరాలకు మార్గదర్శకాలని అన్నారు. కార్యక్రమంలో వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభిరామయ్య, వెలుగారపు సత్యనారాయణ గుర్రాల సత్యవేణి, పడమట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి వేగుళ్ల నామినేషన్ దాఖలు

మండపేట: టీడీపీ తరపున మండపేట అసెంబ్లీకి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన అల్లుడు వల్లూరి సాయికుమార్ టీడీపీ అభ్యర్థిగా మరో సెట్టు నామినేషన్ వేశారు. తొలుత స్థానిక ఏడిద రోడ్డులోని కల్యాణి రైస్‌మిల్లు వద్ద నుంచి తహసీల్దారు కార్యాలయం సమీపం వరకు భారీ ఊరేగింపుగా మద్దతుదారులతో కలసి వేగుళ్ల వెళ్లారు. ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి నామినేషన్

రామచంద్రపురం: రామచంద్రపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా వాసంశెట్టి సుభాష్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌కు సోమవారం అందజేశారు. టీడీపీ, బీజేపీ, జనసేనలకు చెందిన పార్టీల నాయకులు కార్యకర్తలతో ర్యాలీగా ఆయన ఆర్డీవో కార్యాలయానికి సుభాష్ చేరుకున్నారు. అనంతరం నామినేషన్‌ను సమర్పించారు. సుభాష్ భార్య లక్ష్మీసునీత మరో సెట్ నామినేషన్‌ను ఆర్వో సుధాసాగర్‌కు అందజేశారు. కాగా స్వతంత్ర అభ్యర్థిగా యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ రామరాజు ఒక సెట్ నామినేషన్‌ను వేశారు. గుత్తుల జై శ్రీ సూర్యేంద్రనాథ్ బాబూజీ మరో సెట్ నామినేషన్ సమర్పించారు. ఆయన ఇదివరకే రెండు సెట్ల నామినేషన్లను వేశారు. దీంతో సోమవారం నాడు నాలుగు సెట్ల నామినేషన్ల వేసినట్టు ఆర్వో సుధాసాగర్ తెలిపారు. కాగా ఇప్పటి వరకు తొమ్మిది మంది 13 సెట్ల నామినేషన్లను వేసినట్టు ఆర్వో తెలిపారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

- టాపర్లలో అత్యధికులు బాలికలే
- రాయవరం మండలంలో 87.71 శాతం ఉత్తీర్ణత నమోదు



మండపేట గౌతమి మున్సిపల్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మండలంలో వెదురుపాక, రాయవరం, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 700 మంది విద్యార్థులకు 614 మంది 87.71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏ ఒక్క పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించలేదు. ఫలితాల్లో కూర్మాపురం 92 శాతంతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, 73.4 శాతం ఉత్తీర్ణతతో పసలపూడి జెడ్పీహెచ్ఎస్ చివరి స్థానంలో నిలిచింది. మండలంలో బాలురు ఉత్తీర్ణత శాతం 66.98 శాతం కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 74.78 శాతంగా ఉంది. మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 207 మంది పరీక్ష రాయగా, 202 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద మండల ఉత్తీర్ణత 97.58 శాతంగా ఉంది. రాయవరం జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని చింతా జయసాయి మణిదీపిక 583 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. వెదురుపాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మేడపాటి లక్ష్మీగణపూజిత 581, రాయవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మేడపాటి వెన్నెల 576, చేదూరి చారుశ్రుతి 552, పసలపూడి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సత్తి సంజన 569, శీరం రమాదేవి 554, మాచవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు చాగంటి భాగ్యశ్రీ 580, నూకెళ్ల అశ్విని 563, వీరంశెట్టి మల్లేశ్వరి సాయిశ్రీ 551 మార్కులు సాధించారు.

కపిలేశ్వరపురం మండలంలో 97 శాతం

కపిలేశ్వరపురం: మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 387 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాశారు. వారిలో 375 మంది పాసవగా, 97 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించారు. కపిలేశ్వరపురం జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని జీపీ సమీర 557 మార్కులతో మండలంలో టాపర్‌గా నిలిచింది. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థి జీఎస్‌వీ మణికంఠ 548 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థి జీవీ కనకదుర్గ 546 మార్కులతో తృతీయ స్థానంలోనూ నిలిచారు. మాచర, టేకి పాఠశాలల విద్యార్థులు 97 శాతం, కాలేరు, వాకతిప్ప, కపిలేశ్వరపురం విద్యార్థులు 96 శాతం, వల్లూరు పాఠశాల విద్యార్థులు 95 శాతం, నల్లూరు 93 శాతం ఉత్తీర్ణతలు నమోదు చేశారు. టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల 37 మందికి 36 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 70కి 68 మంది ఉత్తీర్ణులై 97 శాతం నమోదైంది. కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 23 మంది పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణులు కావడంతో 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 23 మందికి 22 ఉత్తీర్ణులు కావడంతో 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కపిలేశ్వరపుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 55 మంది పరీక్షలు రాయగా 53 మంది ఉత్తీర్ణులు కావడంతో 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 43 మందికి 41 మంది పాసై 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 40 మంది పరీక్షలు రాయగా 37 మంది పాసై 93 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

మండపేట మండలంలో 88.81 శాతం

మండపేట: టెన్త్ పరీక్షలకు మండలం నుంచి 1796 మంది విద్యార్థులు హాజరవగా, వారిలో 1595 మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఈఓ నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండలంలో 88.81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు వివరించారు. వారిలో బాలురు 918 మందికి 800 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలికల్లో 878 మందికి 795 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. బాలుర ఉత్తీర్ణత 87 శాతం కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 90గా ఉందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల నుంచి 1008 విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, వారిలో 817 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారి ఉత్తీర్ణత శాతం 81గా ఉందన్నారు. మండపేట గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులైన ఎస్.పావనీ దుర్గ 560, కె.లావణ్య 555, పూజిత 542 మార్కులతో మొదటి మూడు స్థానాలు సాధించినట్టు హెచ్ఎం సీహెచ్ శోభావళి తెలిపారు. అలాగే మండలంలోని ద్వారపూడి జెడ్పీ హైస్కూల్ 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం సవితాల సుబ్రహ్మణ్యం తెలిపారు. తమ పాఠశాల్లోని ఆరుగురు విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు.అత్యధికంగా ఎ. దుర్గా ప్రసాద్ 573 మార్కులు సాధించాడు. మొత్తం 92 మంది విద్యార్థులకు గాను 63 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు.

పది ఫలితాల్లో 95 శాతం ఉతీర్ణత

కాజులూరు: సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్షా పలితాలలో కాజులూరు మండలంలో 95 శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించగా మంజేరు జెడ్పీ హైస్కూల్‌ల్లో నూరు శాతం ఉతీర్ణ సాధించినట్టు ఎంఈవో వివేకానంద తెలిపారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అణసూరి జయశ్రావని 571 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలువగా, కాజులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని కోన ఉమాలలితాంబిక 570/600 మార్కులతో ద్వితియ స్థానంలో ఉతీర్ణత సాధించిందన్నారు. కాగా తమ పాఠశాల నుంచి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన అణసూరి జయశ్రావనినీ స్కూల్ హెచ్ఎం పి.సుశీలమణి, గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, స్కూల్ పీడీ సునీల్‌కుమార్ గ్రామ పెద్దలు అభినందించారు.

పదోతరగతి పరీక్షల్లో మెరిసిన విద్యార్థులు

కె.గంగవరం: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల వ్యాప్తంగా పది ఉన్నత పాఠశాలలకు గాను మొత్తం 450 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 418 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల ప్రథమ స్థానం ఓరుగంటి నాగమణి 575 మార్కులు సాధించగా ద్వితీయ స్థానం దంగేరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఇసుకపూడి హేమశ్రీ 565 మార్కులు సాధించింది. తృతీయ స్థానంలో పి.ధనుశ్రీ 563, నకాని సుభాషిని 563, కొండమూరి దుర్గాలక్ష్మి 563 మార్కులు సాధించారు.

రామచంద్రపురంలో 89 శాతం ఉత్తీర్ణత

రామచంద్రపురం రూరల్: ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు గత ఏడాదితో పోలిస్తే బాగా మెరుగుపడ్డాయి. ఎంఈవో ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో 90 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 72 మంది ఉత్తీర్ణులయ్యారు. నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో 53 మందికి 41 మంది, వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో 80 మందికి 57 మంది, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 41 మందికి 39 మంది, వేగాయమ్మపేటలో 26 మందికి 25 మంది, ద్రాక్షారామలో 146 మందికి 119 మంది, బీసీ వెల్ఫేర్ గరల్స్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 23 మందికి 23 మంది, ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 74 మందికి 74 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఇనుమర్తి వీర నాగ చరణ్ 576 మార్కులతో రూరల్ మండలంలో ప్రథమస్థానం సాధించాడు. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వీవీవీఎస్ఎస్ఎస్ సంజన 572 మార్కులతో ద్వితీయ స్థానం పొందింది.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని చాకలిపేట మున్సిపల్ హైస్కూల్‌లో 90 మందికి 69 మంది, కొత్తూరు హైస్కూల్‌లో 25 మందికి 25 మంది, ఎ.సావరం హైస్కూల్‌లో 41 మందికి 41 మంది, పిల్లా వారి హైస్కూల్ 21 మందికి 21 మంది, రత్నంపేట హైస్కూల్‌లో 101 మందికి 79 మంది, రామచంద్రపురం జెడ్పీ హైస్కూల్‌లో 27 మందికి17 గురు, కృత్తివెంటి పేర్రాజు పంతులు గవర్నమెంట్ హైస్కూల్‌లో 86 మందికి 62 మంది ఉత్తీర్ణులయ్యారు. పట్టణంలోని జెడ్పీ గరల్స్ హైస్కూల్ విద్యార్థిని టీడీఎస్ భావన 580 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కొత్తూరు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని కె.వెంకటలక్ష్మి 578 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.



వీర నాగచరణ్, సంజన, భావన, వెంకటలక్ష్మి, నాగమణి, ధనుశ్రీ, జయశ్రావణి, ఉమాలలితాంబిక, జయశ్రీ మణిదీపిక, వినీల, చారుశృతి, జీపీ సమీర, మణికంఠ

మత్స్యకారుల పురోగతికి కృషి



గొల్లపాలెం మత్స్యకార కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రాష్ట్రంలో మత్స్యకారుల పురోగతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం మత్స్యకార కాలనీలోని రామాలయం వద్ద సోమవారం స్థానికులు భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ రామాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆయన స్థానికులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకారులకు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న మత్స్యకార భరోసా చేపల వేట నిషేధ సమయంలో ఎంతగానో ఆర్థికంగా తోడ్పాటు అందిస్తుందన్నారు. స్థానిక చేపల చెరువు విషయంపైనా, పలు స్థానిక సమస్యల పరిష్కారంపైనా సూర్యప్రకాశ్ మత్స్యకారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు నవీన్, వెంకన్న ధర్మరావు, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్ఎంసీ డైరెక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, దంగేటి వెంకన్న, మాదిరెడ్డి పృథ్వీరాజ్, కోటిపల్లి నాగేశ్వరరావు, ఆకుల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో ప్రజల వద్దకే సంక్షేమ పాలన

ఆర్యావటంలో సూర్యప్రకాశ్ భార్య దివ్యశ్రీ ప్రచారం



ఆర్యావటంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ భార్య దివ్యశ్రీ

కాజులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందుతుందని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ భార్య పిల్లి దివ్యశ్రీ అన్నారు. మండలంలోని ఆర్యావటంలో సోమవారం తన భర్త సూర్యప్రకాశ్‌కు మద్దతుగా దివ్యశ్రీ ఇంటింటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ కార్యాలయంలో చేయించుకోవలసిన ఏ చిన్న పనికైనా ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పని వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే ఇచ్చేవారని సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గత టీడీపీ హయాం నుంచి పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్ చెల్లుచీటీ పలికారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, గ్రామ సర్పంచ్ వనుం సూర్యావతి, ఎంపీటీసీ రాయుడు ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'తోట' నామినేషన్‌కు తరలిరండి

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి, పట్టణం నుంచి భారీగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆ పార్టీ రూరల్, అర్బన్ కన్వీనర్లు పిల్లా వీరబాబు, ముమ్మిడివరపు బాపిరాజు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తూ ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకుంటామన్నారు.

సుభాష్ నామినేషన్‌కు స్థానికేతరులు

కె.గంగవరం: రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రజాదరణ లేకపోవడంతో టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ నామినేషన్‌కు అమలాపురం, ముమ్మిడివరం నుంచి భారీగా జనాన్ని తరలించారు. సోమవారం టీడీపీ అభ్యర్థి సుభాష్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా జనసేన, బీజేపీ, టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. అయితే నియోజకవర్గంలో ప్రజాదారణ లేకపోవడంతో సుభాష్ సొంత ఊరు నుంచి జనాన్ని మద్యం, డబ్బులు ఇచ్చి తరలించారని సమాచారం. ముక్తేశ్వరం రేవు నుంచి కోటిపల్లి రేవుకు పంటుపై వందలాది మోటారుసైకిళ్లు, కార్లుపై జనం నామినేషన్‌కు తరలివచ్చారు. దీంతో పాటు ముమ్మడివరం వైపు నుంచి కూడా యానం మీదుగా ద్రాక్షారామకు తరలివచ్చారు. నామినేషన్‌కు వచ్చిన వారిలో సగం మంది స్థానికేతరులు కావడంతో రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు విస్తుపోయారు. అయితే రామచంద్రపురం నియోజకవర్గంలో టీడీపీకి పట్టు మొత్తం పోయింది. కేవలం పొత్తులో భాగంగా జనసేన కలవడంతో జనసేనకు చెందిన యువత మాత్రమే ర్యాలీలో పాల్గొన్నారు. పాల్గొన్న వారు కూడా సైలెన్సర్లు తీసేసి రోడ్డు పక్కగా విన్యాసాలు చేస్తూ ర్యాలీ చేశారు.

కూటమి గెలిస్తే పథకాలకు చెల్లుచీటీ



మండపేట 20వ వార్డులో ప్రచారం చేస్తున్న శెట్టి బత్తుల రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు



తోటను గెలిపించాలని కోరుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు భవాని

- వైఎస్సార్ సీపీ నేత శెట్టిబత్తుల రాజబాబు
- ఎమ్మెల్యే అభ్యర్థి త్రిమూర్తులుకు మద్దతుగా ప్రచారం

మండపేట: రాష్ట్రంలో ముగ్గురు మాయల మరాఠీల కూటమి గెలిస్తే సంక్షేమ పథకాలకు పేదలు దూరం అవుతారని వైఎస్సార్ సీపీ నేత శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా సోమవారం పట్టణంలోని 20వ వార్డులో రాజబాబుతో పాటు పలువురు ఆ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి తదితరులు ఆ వార్డులోని వీధుల్లో పర్యటించారు. మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారంతా కోరారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కనికెళ్ల పల్లవి, కొప్పిరెడ్డి ప్రసాద్, షేక్ మస్తాన్, పాలంకి కమల, కోనాల చంద్రబోస్, కనికెళ్ల ప్రసాద్, కొడమంచిలి భాస్కరరావు, దొరబాబు, పేరూరి మాధవి, గనిపే నాగభూషణం, సొసైటీ ప్రెసిడెంట్ పెంకే గంగాధర్, కౌన్సిలర్లు మలసాని సీతామహాలక్ష్మి, శెట్టి కళ్యాణి, బొక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఏడిదలో జెడ్పీటీసీ భవాని ప్రచారం

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండపేట జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా సోమవారం ఆమె మండలంలోని ఏడిద గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో తోట త్రిమూర్తులు చేసిన అభివృద్ధిని భవాని వివరించారు. ప్రచారంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, తాతపూడి ఉషా రాజేష్ , సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీహరిబాబు, నాయకులు మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వల్లూరి రామకృష్ణ, బూరిగ జానీ, చంద్రమళ్ల బులివీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి



వి.సావరంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: అవినీతి రహితంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ కోరారు. మండలంలోని వి.సావరం గ్రామంలో ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నిలక ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధితో పేదలకు ఆర్థికంగా భరోసా లభించిందన్నారు. వైఎస్సార్ సీపీ మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తోట త్రిమూర్తులును, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. గ్రామంలోని వెలంపేట, రజకులపేటలలో ప్రచారం చేశారు. ప్రచారంలో సొసైటీ అధ్యక్షుడు సిరికి కృష్ణారావు, పార్టీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, కాకి కోటేశ్వరరావు, పంపన గోవిందు, మండ హరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ



లొల్లలో నిర్మించిన నూతన ఆలయం



ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీవరసిద్ధి వినాయకస్వామివారు

రాయవరం: లొల్ల గ్రామంలో సోమవారం మహా కైలాస లింగేశ్వర సహిత గర్భాంతర శ్రీవరసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ఈ నెల 20 నుంచి బ్రహ్మశ్రీ యలమంచిలి సత్యనారాయణశర్మ శివాచార్య అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. లొల్ల, రాయవరం, సోమేశ్వరం తదితర గ్రామాలభక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వినాయక కమిటీ నాయకులు గుండపునీడి వీర్రాజు, కానుమిల్లి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చచేవా సత్యనారాయణ, సర్పంచ్ చాత్రాతి జానకిరాంబాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అందరికీ మంచి చేస్తున్న జగనన్నకే ఓటు వేయండి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్



గ్రామాల్లో మహిళలను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును అందరికీ మేలు చేకూరుస్తూ పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేసి మరోసారి సీఎంగా అవకాశం కల్పించాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ప్రజలను కోరారు. మండలంలోని ఓదూరు, ఓదూరు శివారు జువ్విపాడు, నరసాపురపుపేట, చోడవరం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాల భేదం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్న జగనన్నకు అంబేడ్కర్ కల్పించిన రెండు ఓట్లను వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఓదూరులో గ్రామ సర్పంచ్ వింజుమల్ల విమలకుమారి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్ తదితరులు, నరసాపురపుపేటలో మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి ఏడుకొండలు, గ్రామ నాయకులు రెడ్డి దొరబాబు, పిల్లి సూరిబాబు తదితరులు, చోడవరంలో గ్రామ సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ, ఎంపీటీసీ సాదే సుభద్ర, నాయకులు పిల్లి వీరరాఘవులు, బిక్కిన సురేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వి.సావరం నుంచి తోట ప్రచారం

రాయవరం: వైఎస్సార్ సీపీ మండపేట అభ్యర్థి తోట త్రిమూర్తులు మండలంలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం వి.సావరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ మండపేట కార్యాలయ ప్రతినిధి శేఖర్ సోమవారం రాత్రి తెలిపారు. ఉదయం 8 గంటలకు వి.సావరం నుంచి త్రిమూర్తులు ప్రచారం మొదలవుతుందని చెప్పారు. ఉదయం 9 గంటలకు నదురుబాద, 10 గంటలకు వెదురుపాక గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు రాయవరం, సాయంత్రం ఐదు గంటలకు లొల్లలో ప్రచారం నిర్వహించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో పాల్గొనాలని కోరారు.